సాక్షి
చిత్తూరు
సోమవారం। 15। మే। 2023



రామబంటు.. నీవే శరణమంటూ..

తిరుమలలో ఆదివారం హనుమజ్జయంతిని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. - 8లో



గంగమ్మ భక్తిచైతన్య సంబరం

శ్రీతాతయ్యగుంట గంగమ్మ జాతర సందర్భంగా ఆదివారం సాయంత్రం తిరునగరిలో చేపట్టిన భక్తి చైతన్య యాత్ర అంబరాన్నంటింది. - 10లో

	గరిష్ఠం	కనిష్ఠం
చిత్తూరు	41	28
తిరుపతి	42	29
తిరుమల	38	24
గూడూరు	44	31
నగరి	43	29

న్యూస్‌రీల్

సీఎం సహాయనిధి ఓ వరం



చెక్కులను అందిస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

శ్రీరంగరాజపురం : ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు ఓ వరమని ఉప ముఖ్య మంత్రి నారాయణస్వామి అన్నారు. సీఎం సహాయ నిధి నుంచి ఇద్దరికి మంజూరైన చెక్కులను ఆయన పుత్తూరులోని తన నివాసంలో ఆదివారం ఆయన అందజేశారు. వెదురుకుప్పం మండలం దాసరికాలనీకి చెందిన రాజేష్ అనారోగ్యానికి గురికాగా, వేలూరు సీఎంసీ హాస్పటల్‌లో కిడ్నీ ఆపరేషన్ జరిగింది. ఆపరేషన్‌కు రూ.లక్షలకు పైగా ఖర్చు అయ్యింది. శ్రీరంగరాజపురం మం డలం చిన్న తయ్యూరు గ్రామానికి చెందిన చిన్నికి గర్భస్థ చికిత్సకు రూ.లక్షలు ఖర్చు అయింది. స్తోమతకు మించి ఖర్చు చేసి అవస్థలు పడుతున్న బాధితుల విషయం డిప్యూటీ సీఎం నారాయణస్వామి తెలుసుకున్నారు. బాధితుల నుంచి బిల్లులు సేకరించి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రాజేష్‌కు రూ. 4 లక్షలు, చిన్నికి రూ. 2లక్షల 20 వేలు మంజూరయ్యేలా చేశారు. ఆదివారం సీఎం సహాయ నిధి చెక్కులను బాధితులకు ఆయన అందజేశారు. జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్, నాయకులు బాబు, కాశప్ప, బండి రోసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో స్పందన

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ వెల్లడించారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ప్రజలు సమస్యలను వినతుల రూపంలో అందజేయవచ్చన్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు స్పందన జరుగుతుందని తెలిపారు. ఆయా శాఖల జిల్లా అధికారులు కచ్చితంగా హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు.

నేడు పోలీసు స్పందన

చిత్తూరు అర్బన్: చిత్తూరు వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పక్కనున్న ఆర్మ్‌డ్ రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ వై.రిశాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రజలు వినతులు సమర్పించవచ్చన్నారు. ఏవైనా సమస్యలుంటే నేరుగా తనను కలిసి మాట్లాడవచ్చని పేర్కొన్నారు.

నేడు చిత్తూరులో మంత్రి అంబటి పర్యటన

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు సోమవారం జిల్లా కేంద్రానికి విచ్చేయనున్నారు. ఈ మేరకు ఆదివారం కలెక్టరేట్‌కు ఉత్తర్వులు అందాయి. మంత్రి సోమవారం ఉదయం 11.30 గంటలకు చిత్తూరుకు విచ్చేస్తారు. 11.30 నుంచి 12.30 గంటల వరకు జలవనరుల శాఖ డేటా సెంటర్‌ను ప్రారంభిస్తారు. 12.40 నుంచి 1.15 గంటల వరకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు జన్మదినాన్ని పురస్కరించుకుని పీసీఆర్ జూనియర్ కళాశాలలో నిర్వహించే మెడికల్ క్యాంప్‌లో పాల్గొంటారు. 1.30 నుంచి 2 గంటల వరకు వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. 3.30 గంటలకు తిరుపతికి బయలుదారుతారు.

కాణిపాకంలో భక్తుల కిటకిట



భక్తులతో నిండిన క్యూలు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. వేసవి సెలవుల దృష్ట్యా స్వామివారి దర్శనార్థం భక్తులు అశేషంగా తరలి వస్తున్నారు. క్యూలన్నీ భక్తులతో నిండిపోయి ఆల యం వెలుపలి వరకు బారులు తీరుతున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా దేవస్థానం అధికారులు ప్రత్యేక చర్యలు తీకుంటూ స్వామివారి దర్శనం కల్పిస్తున్నారు.

తిరుపతి రైల్వేస్టేషన్‌లో పెరిగిన రద్దీ

తిరుపతి అర్బన్ : వేసవి సెలవుల నేపథ్యంలో తిరుపతి రైల్వేస్టేషన్ ప్రయాణికులతో కిటకిటలాడుతోంది. నిత్యం పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. తిరుపతి మీదుగా సుమారు 96 రైళ్ల రాకపోకలు సాగిస్తున్నాయి. నెలకు రూ.35 లక్షలకు పైగా రాబడి వస్తోంది. మెరుగైన వసతులు సమకూరుస్తుండడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అట్టహాసంగా చంద్రగిరి ఐపీఎల్



టోర్నీ ప్రారంభిస్తున్న టీటీడీ బోర్డు చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, వేదికపై ఎమ్మెల్యే చెవిరెడ్డి తదితరులు

వందలాది జట్లు...రంగురంగుల క్రీడా దుస్తులతో వేలాది మంది క్రీడాకారులు... ఎటు చూసినా మైదానాలు..ఉత్కంఠంగా సాగుతున్న మ్యాచ్‌లు...హోరెత్తించే యువత నినాదాలు...విజేతల హర్షాతిరేకాలు.. ప్రతి ఒక్కరిలోనూ క్రీడాయజ్ఞంలో పాలుపంచుకున్న భావన...తండ్రిని మించిన తనయుడిగా 'ఆట' ఆరంభించారని చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిపై ప్రశంసలతో ఆదివారం చంద్రగిరి ఐపీఎల్ టోర్నీ అట్టహాసంగా ప్రారంభమైంది.

- ఒకే వేదికపై 1000 జట్లు.. 15వేల మంది క్రీడాకారులు
- దేశంలో ఎక్కడా లేని విధంగా ఒకే చోట 16 గ్రౌండ్లు ఏర్పాటు
- క్రికెట్ టోర్నమెంట్‌కు విశేష స్పందన

తిరుపతి రూరల్: గ్రామీణ యువతలోని క్రీడా నైపుణ్యాలను వెలికి తీయాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఏటా వైఎస్సార్ గ్రామీణ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. వందలాది జట్లతో జరిగే ఈ టోర్నమెంట్ చంద్రగిరి ఐపీఎల్‌గా పేరు పొందింది. కరోనా కారణంగా గత రెండేళ్లుగా నిలిచిన ఈ పోటీలను చంద్రగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పునఃప్రారంభించారు. నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాల నుంచి క్రీడాకారులను టోర్నీకి ఆహ్వానించారు. తుమ్మలగుంట వేదికగా ఒకే చోట 16 గ్రౌండ్లను ఏర్పాటు చేశారు ఒక్కో గ్రౌండ్ నుంచి ప్రతి రోజు నాలుగు మ్యాచ్‌లు నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. సుమారు వెయ్యి జట్లు క్రికెట్ పోటీల్లో పాల్గొనేందుకు దరఖాస్తులు చేయడంతో అందుకు తగ్గట్టుగా భారీ సన్నాహాలు చేశారు. ప్రత్యక్షంగా 15 వేల మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. మరో 10 వేల మంది ప్రేక్షకులు మ్యాచ్‌లను తిలకించేందుకు వస్తున్నారు.

ట్రోఫీ గ్యాలరీ ప్రారంభం

తుమ్మలగుంటలో వైఎస్సార్ గ్రామీణ క్రికెట్ టోర్నమెంట్ (చంద్రగిరి ఐపీఎల్)కు టీటీడీ బోర్డు చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి చేతులు మీదుగా ఆదివారం శ్రీకారం చుట్టారు. ముందుగా క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు బహూకరించనున్న ట్రోఫీలు, మెడల్స్ గ్యాలరీని ప్రారంభించారు. మైదానంలోకి చేరుకుని క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం టీటీడీ బోర్డు చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వరరెడ్డి, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సరదాగా క్రీడాకారులతో కలిసి క్రికెట్ ఆడారు.

క్రీడా మైదానాలు అవసరం : మోహిత్‌రెడ్డి

పల్లెల్లో ఆలయాలు ఎంత ముఖ్యమో.. క్రీడా మైదానాలు అంతే అవసరమన్న స్వామి వివేకానంద మాటలను స్ఫూర్తిగా తీసుకుని గ్రామీణ యువతను క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నామని చంద్రగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి వెల్లడించారు. 40 ఏళ్ల తర్వాత ఆస్పత్రికి వెళ్లకూడదు అనుకుంటే 20 ఏళ్ల నుంచే గ్రౌండ్‌కు వెళ్లడం అలవాటు చేసుకోవాలని సూచించారు. క్రీడా స్ఫూర్తితో స్నేహపూర్వక వాతావరణంలో మ్యాచ్‌లు ఆడాలని కోరారు.

ప్రజలకు అండగా ఉంటాం : చెవిరెడ్డి

కష్టాలు వచ్చినా.. సంతోషం వచ్చినా.. ఆపద వచ్చినా.. ఆర్థిక సమస్యలు వచ్చినా.. కులం చూడం.. మతం చూడం.. పార్టీలు చూడం.. అందరికీ అండగా నిలవడమే ధ్యేయం..నా కుటుంబంతో సమానంగా చంద్రగిరి నియోజకవర్గంలోని ప్రజలను చూసుకోవడం తనకు అలవాటని ఎమ్మెల్యే చెవిరెడ్డి స్పష్టం చేశారు. టోర్నమెంట్ లో పాల్గొనే ప్రతి జట్టుకు రూ.20వేల విలువైన క్రికెట్ కిట్ ఇవ్వడంతో పాటు ప్రతి క్రీడాకారుడికీ బ్రాండెడ్ టీ షర్ట్, పార్టిసిపేట్ సర్టిఫికేట్, మెడల్స్ బహూకరిస్తున్నట్లు తెలిపారు. పోటీలు పారదర్శకంగా నిర్వహించేందుకు నిష్ణాతులైన 80 మంది అంపైర్లను అందుబాటులోకి తీసువచ్చామన్నారు. టోర్నీ విజేతకు రూ.25లక్షల మేర నగదు బహుమతులు ఇస్తున్నామని చెప్పారు. క్రీడాకారులకు ప్రతి రోజు ఉదయం 7 నుంచి రాత్రి 7 గంటల వరకు నిరంతరం అల్పాహారం, భోజనం, తాగునీటి వసతులు కల్పిస్తున్నట్లు వివరించారు.

తొలిరోజు విజేతలు బందార్లపల్లె, సప్తగిరికాలనీ

క్రికెట్ టోర్నమెంట్ తొలిరోజు రెండు మ్యాచ్‌లను మాత్రమే నిర్వహించారు. బందార్లపల్లె, సప్తగిరి కాలనీ జట్లు విజేతలుగా నిలిచాయి.

చెవిరెడ్డి కుటుంబం వెంటే యువత



చంద్రగిరి యువత మొత్తం చెవిరెడ్డి కుటుంబం వెంటే నడుస్తోందని, ఇందుకు ఈ టోర్నమెంటే నిదర్శనమని టీటీడీ బోర్డు చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. క్రికెట్ పోటీలను ప్రారంభించిన తర్వాత ఆయన మాట్లాడుతూ నియోజక వర్గ ప్రజలను తన కుటుంబ సభ్యులుగా భావించే చెవిరెడ్డిపై జనాభిమానం వెల్లువెత్తుతోందన్నారు. క్రికెట్ టోర్నమెంట్ నిర్వహణకు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పిలుపునిచ్చిన పది రోజుల్లోనే వెయ్యి జట్లు సిద్ధం కావడం చూస్తుంటే ప్రజల్లో ఆ కుటుంబానికి ఉన్న ఆదరణ ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చని వెల్లడించారు. కలెక్టర్ వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ భరోసా కల్పించే చెవిరెడ్డి వంటి నాయకుడు ఎమ్మెల్యేగా దొరకడం చంద్రగిరి ప్రజల అదృష్టమన్నారు. జేసీ బాలాజీ, తుడా వీసీ హరికృష్ణ, కార్యదర్శి లక్ష్మి పాల్గొన్నారు.



క్రీడాకారులకు క్రికెట్ కిట్‌ల పంపిణీ



ట్రోఫీలను పరిశీలిస్తున్న వైవీ సుబ్బారెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి



క్రికెట్ ఆడుతున్న వైవీ సుబ్బారెడ్డి, కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వరరెడ్డి, జేసీ బాలాజీ, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

వైభవంగా హనుమజ్జయంతి



అర్ధగిరిలో ఇరుముడులతో వస్తున్న భక్తులు



హోమ పూజలు

తవణంపల్లె: జిల్లాలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో హనుమజ్జయంతి వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీవీరాంజనేయస్వామిలో వేకువ జామునే పంచామృతంతో అభిషేకం, విశేషాలంకరణలు, కలశారాధన నిర్వహించారు. పలురాష్ట్రాల నుంచి అశేష సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం 9 గంటలకు హనుమాన్ మాలధారణ భక్తులు ఇరుముడులతో పూజలు చేశారు. దీక్ష విరమించి మొక్కులు చెల్లించారు.11 గంటలకు శ్రీఆంజనేయ సహస్రనామ హోమాన్ని నిర్వహించారు. ట్రస్టుబోర్డు చైర్మన్ పైమాఘం సురేంద్రరెడ్డి, ఈఓ వెంకటసుబ్బారెడ్డి, సభ్యులు, ఉభయదారుల సమక్షంలో హోమ పూజలు జరిగాయి. తదుపరి స్నపన తిరుమంజనం, మంత్రపుష్పం, మహామంగళ హారతి సమర్పించారు. సాయంత్రం 5 గంటలకు తులసి, పుష్పాదులచే సహస్ర నామ పూజ చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. రాత్రి 7 గంటలకు పల్లకిలో స్వామివారి ప్రాకారోత్సవం వేడుకగా జరిగింది. ఉదయం నుంచి శ్రీరామకోటి ఆరాధనను 24 గంటలు కొనసాగించారు. అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పుష్ప, విద్యుద్దీపాలంకరణలు ఆకట్టుకున్నాయి. అలాగే ఎగువ మత్యం అభయాంజనేయ స్వామి, చిల్లారపల్లె ఆంజనేయస్వామి, జి. గొల్లపల్లె ఆంజనేయస్వామి ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి.

హంస, శేష వాహనాలపై వేణుగోపాలుని విహారం



చిన్నశేషవాహనంపై విహరిస్తున్న వేణుగోపాలుడు



వీణాపాణిగా హంస వాహనంపై విహారం

కార్వేటినగరం: కార్వేటినగరంలో టీటీడీ అనుబంధంలో ఉన్న ప్రముఖ శ్రీవేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం చిన్న శేషవాహనంపై, రాత్రి హంస వాహనంపై విహరిస్తూ స్వామివారు భక్తులను అనుగ్రహించారు. బ్రహ్మోత్సవాల్లో రెండవ రోజు ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. 7.30 గంటలకు గజమాలలు, విశేషాభరణాలు, పట్టుపీతాంబరాలతో అలంకృతుడైన వేణుగోపాలుడు చిన్న శేషవాహనంపై కొలువుదీరి పూజలందుకున్నారు. అనంతరం చెక్కభజనలు, కోలాటాలు, మేళతాళాల నడుమ పురవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు రుక్మిణి, సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామివారి ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం వేదోక్తంగా నిర్వహించారు. సాయంత్రం 5.30 గంటలకు ఊంజల్ సేవ నేత్రపర్వంగా జరిగింది. రాత్రి ఏడు నుంచి 9 గంటల వరకు వీణ ధరించి సరస్వతీ రూపంలో హంస వాహనంపై ఆశీనులై స్వామివారు పురవీధుల్లో విహరించారు. భక్తులు అడుగ డుగునా కర్పూర హారతులు సమర్పించారు. డెప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో మోహన్, సూపరింటెండెంట్ రమేష్‌బాబు, ఆలయ అధికారి సురేష్‌కుమార్, కంకణభట్టు గోపాలాచార్యులు, అర్చకులు పాల్గొన్నారు.

నేడు సింహ వాహనం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవ రోజు సోమవారం ఉదయం సింహ వాహనంపై, రాత్రి ముత్యపు పందిరి వాహనంపై స్వామివారు విహరిస్తారని ఆలయ అధికారి సురేష్‌కుమార్ పేర్కొన్నారు.

జలం పదిలం

నీటిని పొదుపుగా వాడుకుని సంరక్షించు కోవడంపై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ప్రధానంగా భూగర్భ జలాలపై నిత్యం పర్యవేక్షణ నిర్వహించనుంది. భూగర్భ జాలల వృద్ధి, వాటి వినియోగం, జలాల స్థాయి తదితర అంశాలపై ఎప్పటికప్పుడు నివేదికల సేకరణ, సేకరించిన డేటాను నిల్వ చేసి తద్వారా జలాల వినియోగంపై రైతులు, ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టనుంది. ఇందు కోసం నూతనంగా నిర్మించిన జిల్లా భూగర్భజల శాఖ డేటా సెంటర్ భవనాన్ని సోమవారం మంత్రి అంబటి రాంబాబు ప్రారంభించనున్నారు.

- భూగర్భ జలాలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ
- సకల సౌకర్యాలతో జిల్లా డేటా సెంటర్ ఏర్పాటు
- నేడు ప్రారంభించనున్న మంత్రి అంబటి రాంబాబు



జిల్లా డేటా సెంటర్ నూతన భవనం

చిత్తూరు అగ్రికల్చర్: జిల్లాలో భూగర్భ జలాల స్థితి గతులను ఆయా ప్రాంతాల వారీగా భూగర్భ జలశాఖ అధికారులు సేకరించి నెలవారి డేటాను నమోదు చేసే చర్యలు ప్రారంభం కానున్నాయి. జిల్లా వ్యాప్తంగా భూగర్భ జలాల స్థితి గతులను ఎప్పటికప్పుడు భూగర్భజల శాఖ పర్యవేక్షిస్తుంటుంది. ఇందుకుగాను ప్రత్యేకంగా అన్ని మండలాల పరిధిలో ప్రభుత్వం 70 ప్రత్యేక బోర్లను ఏర్పాటు చేసింది. ఈ బోర్లకు ఆటోమెటిక్ వాటర్‌లెవల్ రికార్డర్ యంత్రాలను సమకూర్చింది. ఈ రికార్డర్‌ల ద్వారా ప్రతి 6 గంటలకు భూగర్భ జలాల స్థితి గతులను నమోదు చేస్తారు. ఈ నమోదు ప్రక్రియ నేరుగా ఆన్‌లైన్‌లో నేషనల్ డేటా సెంటర్‌కు అనుసంధానం ఉంటుంది. ఈ విధంగా నమోదైన భూగర్భ జలాల స్థితి గతులను ఆయా ప్రాంతాల వారీగా భూగర్భ జలశాఖ అధికారులు సేకరించి నెలవారి డేటాను నమోదు చేయనున్నారు.

రూ.1.90 కోట్లతో జిల్లా డేటా సెంటర్

జిల్లా కేంద్రలో భూగర్భ జల శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ బ్యాంకు నిధులు దాదాపు రూ.1.90 కోట్లు వెచ్చించి అన్ని సౌకర్యాలతో జిల్లా డేటా సెంటర్ నూతన భవనాన్ని నిర్మించారు. ఈ భవనాన్ని సోమవారం రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రారంభించనున్నారు.

డేటా సెంటర్ ఉపయోగాలు...

డేటా సెంటర్ ఏర్పాటుతో ఎప్పటికప్పుడు భూగర్భ స్థితి గతులను నమోదు చేయవచ్చు. ప్రత్యేక బోర్లకు ఏర్పాటు చేసి ఉన్న ఆటోమెటిక్ వాటర్ లెవెల్ రికార్డర్ నుంచి ఆన్‌లైన్ ద్వారా నేరుగా భూగర్భ జలస్థితి గతులు డేటా సెంటర్ లో నమోదవుతుంది. ఇప్పటికే సేకరించి ఉన్న దాదాపు రెండు దశాబ్దాల భూగర్భ జలాల స్థితి డేటాను ఇందులో శాశ్వతంగా నమోదు చేసుకోవచ్చు. తద్వారా భూగర్భ స్థితిని గుర్తించి అవసరమైతే అత్యధికంగా నీటి వినియోగం ఉన్న ప్రాంతాల రైతులు, పరిశ్రమలదారులు తదితరులకు ఎప్పటికప్పుడు డేటా సెంటర్‌లో అవగాహన సదస్సులు నిర్వహించవచ్చు. భూగర్భ జల స్థితి, నీటి వినియోగంపై డేటా సెంటర్‌లో చిత్రాల ద్వారా అవగాహన సదస్సుల్లో ప్రదర్శించే వెసులుబాటు ఉంటుంది. తద్వారా భవిష్యత్తులో భూగర్భ జలాలను పరిమితంగా ఉపయోగించుకుని నీటిని సంరక్షించుకునేందుకు డేటా సెంటర్ దోహదపడుతుంది.

భూగర్భ జల స్థితిపై పర్యవేక్షణ

భూగర్భ జలాల్లో 70 శాతం వరకు వినియోగించుకుంటే సేఫ్ జోన్‌లోనే ఉన్నట్లు గుర్తిస్తారు. 70 నుంచి 90 శాతం వరకు వినియోగాన్ని సెమి క్రిటికల్, 90 నుంచి వంద శాతం మేరకు వినియోగాన్ని క్రిటికల్ స్థాయిగా గుర్తిస్తారు. వంద శాతానికి పైబడి వినియోగం ఉన్న ప్రాంతాలను అత్యంత ప్రమాదకరంగా గుర్తించి ఆయా ప్రాంతాలను డార్క్ ఏరియాలుగా పరిగణిస్తారు. ఆ ప్రాంతాల్లో నీటి వినియోగంపై కొంత నిబంధనలను విధిస్తారు.

ముందస్తుగా సంరక్షణ చర్యలు

భూగర్భ జలాలను పొదుపుగా వాడుకుని కాపాడుకోవడం చాలా ప్రధానం. జిల్లా కేంద్రంలో డేటా సెంటర్ ఏర్పాటు చేయడం వల్ల ఎప్పటికప్పుడు భూగర్భ జలాల స్థితి గతులను నమోదు చేసుకునే వెసులుబాటు ఉంటుంది. తద్వారా అధిక నీటి వినియోగం ప్రాంతాలను గుర్తించి ముందస్తుగా సంరక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవచ్చు.



- కె.గోవర్ధన్‌రెడ్డి, జిల్లా భూగర్భ జలశాఖ అధికారి

భక్తులతో పోటెత్తిన బోయకొండ



ప్రత్యేకాలంకరణలో అమ్మవారు, ఆలయంలో భక్తుల రద్దీ

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన శ్రీబోయకొండ గంగమ్మ ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో పోటెత్తింది. వేసవి సెలవుల నేపథ్యంలో కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు పిండిదీపాలు వెలిగించి మొ క్కులు చెల్లించారు. ఉదయం ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారిని విశేషంగా అలంకరించారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రద్దీ సాగింది. ఆలయ పరిసర ప్రాంతాలు భక్తులతో సందడిగా మారాయి. భక్తులకు అవసరమైన సౌకర్యాలను దేవస్థానం ఈఓ చంద్రమౌళి పర్యవేక్షించారు. ఎస్‌ఐ రవికుమార్ నిఘా ఏర్పాటు చేశారు.

రామబంటు..నీవే శరణమంటూ..

- ఘనంగా హనుమజ్జయంతి
- తిరుమలలో అలరించిన భక్తి సంగీత కార్యక్రమాలు
- వెంకటగిరిలో వైభవంగా శోభాయాత్ర
- పెంచలకోనలో క్షేత్రోత్సవం



ఆకాశగంగలో కీర్తనలు ఆలపిస్తున్న కళాబృందం



తిరుమల మొదటిఘాట్‌లోని ఆంజనేయస్వామి గుడి వద్ద ప్రత్యేక పూజలు

తిరుమల: తిరుమలలో ఆదివారం హనుమజ్జయంతిని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆకాశగంగ, జాపాలి తీర్థంలో జరిగిన భక్తి సంగీత కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆకాశగంగలోని శ్రీ బాలాంజనేయ స్వామివారి ఆలయం వద్ద ఉదయం 9 నుంచి 10 గంటల వరకు హిందూ ధర్మ ప్రచార పరిషత్ కళాకారులు శ్రీరామ నామ సంకీర్తనలు ఆలపించారు. అనంతరం చిన్నారులు హనుమాన్ చాలీసా పఠించారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు దాససాహిత్య వాగ్గేయకారులు హనుమత్ సంకీర్తనలను గానం చేశారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు హిందూ ధర్మ ప్రచార పరిషత్ కళాకారులు ఆంజనేయస్వామివారి అవిర్భావంపై హరికథ పారాయణం చేశారు. జాపాలి క్షేత్రంలో టీటీడీ దాససాహిత్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి పీఆర్ ఆనంద తీర్థాచార్యులు ఆధ్వర్యంలో కళాకారులు ఉదయం 8.30 నుంచి 10.30 గంటల వరకు హనుమాన్ చాలీసా పఠించారు. ఉదయం 10.30 నుంచి 11.30 ఎస్వీ సంగీత, నృత్య కళాశాల అధ్యాపకులు వందన ఆధ్వర్యంలో హనుమాన్ కీర్తనలను సుమధురంగా ఆలపించారు. ఉదయం 11.45 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు చిన్నారులు బాల ఆంజనేయ విజయం నృత్య రూపకాన్ని ప్రదర్శించారు. అనంతరం మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు పలు భక్తి సంకీర్తనలతో అలరించారు.

వెంకటగిరి: పట్టణంలో ఆదివారం ఘనంగా హనుమజ్జయంతి వేడుకలు జరుపుకున్నారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో వైభవంగా హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు, వివిధ ధార్మిక సంస్థల ప్రతినిధులు తరలివచ్చారు. ముందుగా మోటారుసైకిళ్లతో భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం పాత విశ్వోదయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం నుంచి శోభాయాత్ర ప్రారంభించారు. త్రిభువని సెంటర్, కై వల్యానది పాత వంతెన మీదుగా కాశీపేట, బజారువీధి, మార్కెట్‌వీధి, వీరాంజనేయస్వామి ఆలయం, పోలేరమ్మ ఆర్చిసెంటర్, పాత బస్టాండ్, తూర్పువీధి, దక్షణపువీధి, బోసుబొమ్మ సెంటర్ నుంచి కాశీవిశ్వనాథస్వామి ఆలయం వరకూ యాత్ర సాగింది. ఇందుకూరుపేటకు చెందిన శ్రీలలితా భరద్వాజ దత్తపీఠం పీఠాధిపతి డాక్టర్ రామాయణం మహేష్‌స్వామి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పార్టీలకు అతీతంగా నేతలు, కార్యకర్తలు భక్తిభావంతో యాత్రలో భాగస్వాములయ్యారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ జి.ఢిల్లీబాబు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎస్‌ఎస్‌ఆర్ నాయుడు, టీడీపీ నేత డాక్టర్ బి.మస్తాన్‌యాదవ్, వీహెచ్‌పీ నాయకులు సుంకర రవికుమార్, వడ్లమూడి భాస్కర్, ఏ.శివప్రసాద్, పవన్, మల్లికార్జున్, దశయ్య, శేషాద్రి, బీజేపీ నేత శ్రావణ్‌కుమార్, సమరతా ఫౌండేషన్ కో–ఆర్డినేటర్ అద్దంకి విజయలక్ష్మి పాల్గొన్నారు.

రాపూరు : పెంచలకోనలో హనుమజ్జయంతిని పురస్కరించుకుని వీరాంజేయస్వామివారికి ఆదివారం రాత్రి వైభవంగా క్షేత్రోత్సవం నిర్వహించారు. స్వామివారి మూలమూర్తికి ఉదయం అభిషేకం, పూలంగిసేవ, చందనాలంకారం,ఆకుపూజ,వడమాలలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.రాత్రి 7 గంటలకు శ్రీవారి కల్యాణ మండపంలో తిరుచ్చిపై ఆంజనేయస్వామి ఉత్సవమూర్తిని కొలువుదీర్చి విశేషంగా అలంకరించారు. మంగళవాయిద్యాలతో వేదపండితులు మంత్రోచ్చారణల నడుమ క్షేత్రోత్సవం జరిపించారు. అలాగే రాపూరులోని శ్రీరామమందిరంలో ప్రసన్నాంజేయునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు రామనాథేశ్వరశర్మ తీర్థప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. మద్దెలమడుగులో అయ్యప్ప ఆలయ ప్రాంగణంలోని 30 అడుగుల ఆంజేయస్వామి విగ్రహానికి విశేష పూజలు జరిపించారు. భక్తులకు అన్నదానం చేపట్టారు.



పెంచలకోనలో విహరిస్తున్న వీరాంజనేయుడు



వెంకటగిరి : ఊరేగుతున్న ఆంజనేయస్వామి



వెంకటగిరి : శోభాయాత్రలో పీఠాధిపతి మహేష్‌స్వామి



బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,200
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,400
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.78,000
రిటైల్ వెండి గ్రాము	రూ.80

వివాహిత ఆత్మహత్య కేసులో భర్త, మరో ఇద్దరు అరెస్టు

చిత్తూరు అర్బన్: చిత్తూరులో శాంతి అనే వివాహిత మృతి కేసులో ఆమె భర్త నాగరాజు, అత్త పుష్పావతి, ఆడపడుచు పద్మజను ఆదివారం వన్ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. నగరంలోని ఎస్టేట్ సమీపంలో ఉన్న జయలక్ష్మి కాలనీకి చెందిన వివాహిత శాంతి శనివారం ఇంట్లోని రెండంతస్తుల మేడ పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. తన కుమార్తె మరణానికి భర్తతోపాటు ఆమె అత్త, ఆడపడుచు కారణమంటూ మృతిరాలి తల్లి పార్వతమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన వన్ టౌన్ సీఐ భాస్కర్ దర్యాప్తు ప్రారంభించారు. శాంతి మృతికి భర్త నాగరాజుతో పాటు అతని తల్లి, చెల్లెలు కారణమని తేల్చారు. ఆత్మహత్య చేసుకునే సమయంలో కనీసం శాంతిని నాగరాజు ఆపలేకపోయాడని, ఆమె మిద్దె పైనుంచి దూకేస్తామని చెప్పినా కూడా పట్టించుకోలేదని సీఐ తెలిపారు. నిందితులు ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

మహిళ ఆచూకీ లభ్యం

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని చామంతిపురంలో మూడు రోజులకు కిందట అదృశ్యమైన మహిళ ఆచూకీ లభ్యమైంది. భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. తమిళనాడులోని పుట్టింటికి వెళ్లినట్లు సమాచారం అందుకున్నారు. ఆమెను విచారించగా..భర్త సెల్‌ఫోన్ అధికంగా వాడొద్దన్ని మందలించాడని.. అందుకే ఇంటి నుంచి అలిగి వచ్చేశానని తెలిపారు.

చిత్తూరు జాతరకు పటిష్ట బందోబస్తు

- అడగడుగునా పోలీసుల నిఘా
- మండపాల వద్ద ప్రత్యేక టీమ్‌లు
- డీఎస్పీ శ్రీనివాసమూర్తి వెల్లడి

చిత్తూరు అర్బన్: ఈనెల 16, 17 తేదీల్లో జరిగే చిత్తూరు గంగ జాతరకు భారీ బందోబస్తు కల్పిస్తున్నట్లు డీఎస్పీ శ్రీనివాసమూర్తి తెలిపారు. ఆదివారం నగరంలోని కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రశాంత గంగజాతరకు పోలీసు శాఖ ముందస్తు చర్యలు చేపట్టిందన్నారు. బందోబస్తుకు 600 మందిని నియమించినట్లు తెలిపారు. తనిఖీలతో పాటు నగర సరిహద్దులో ఐదు చెక్ పోస్టులు, 14 పికెట్లు, నాలుగు రక్షక్ మొబైల్స్, 08 బ్లూ కోట్ మొబైల్స్ 24 గంటలు పనిచేస్తాయని పేర్కొన్నారు. నడి వీధి గంగమ్మతో పాటు గిరింపేట, కొంగారెడ్డిపల్లె, కట్టమంచి, సంతపేట, ఓబనపల్లె, ఓబనపల్లె కాలనీ, మంగసముద్రం తదితర ప్రాంతాల్లో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు అమర్చుతున్నామన్నారు. అన్ని శాఖల సమన్వయంతో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూస్తామని తెలిపారు.



డీఎస్పీ శ్రీనివాసమూర్తి



చిన్నపిల్లలు తప్పిపోతే గుర్తించేందుకు సిద్ధం చేసిన ట్యాగ్‌లు

వాహనాల రూటు మళ్లింపు

జాతర దృష్ట్యా వాహనాల రూటు మళ్లిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు ఎక్కడబడితే అక్కడ వాహనాలను నిలప కూడదన్నారు. పోలీసులు కేటాయించిన స్థలంలోనే పార్కింగ్ చేయాలన్నారు. విలువైన వస్తువులను భద్రం చేసుకోవాలని సూచించారు. జాతర పేరుతో మితిమీరితే కేసులు తప్పవని హెచ్చరించారు. చిన్నపిల్లల రక్షణపై మరింత జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. మహిళా పోలీసు ద్వారా తల్లిదండ్రుల ఫోన్‌నంబర్లను ట్యాగ్‌పై రాసి పిల్లల చేతికి కడుతామని తెలిపారు. తద్వారా తప్పిపోయిన పిల్లలను వారి తల్లిదండ్రులకు అప్పగించడం సులభతరమవుతుందన్నారు.

గంగమ్మకు ఆభరణాల బహూకరణ

చిత్తూరు రూరల్: చిత్తూరు గంగమ్మ జాతర సందర్భంగా పలువురు అమ్మవారికి కానుకగా ఆభరణాలను సమర్పించారు. నగరంలోని గీతామందిరంలో ఆదివారం నడివీధి గంగమ్మ అలంకరణ ఆభరణాలను ప్రదర్శించారు. జాతర వంశపారంపర్య ధర్మకర్త, మాజీ ఎమ్మెల్యే సీ.కేబాబు ఆధ్వర్యంలో ఆభరణాలతో పాటు కొత్తగా చేయించిన మంగళ సూత్రాన్ని కూడా ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళ, బుధవారాల్లో అత్యంత వైభవంగా జరిగే నడివీధి గంగమ్మజాతర వేడుకల్లో ప్రజలు ఉత్సహంగా పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలన్నారు. కేవీఆర్ జ్యూవలర్స్ నారాయణమూర్తి రూ.3 లక్షలు విలువ చేసే తాళిబొట్టును విరాళంగా అందజేశారన్నారు. వేమారెడ్డి అనే భక్తుడు రూ. 84 వేలు విలువ చేసే వెండి ఢమరుకం, సీఆర్‌సీ జ్యూవలర్స్ రవి రూ. 45 వేల వ్యయంతో ఫ్యాన్సీ అభరణాలు తయారు చేయించి అమ్మవారికి కానుకగా సమర్పించారని తెలిపారు. కొందరు సీలింగ్‌ఫ్యాన్లు, సోమ, మంగళవారాల్లో ఉచితంగా మజ్జిగ పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు చేపడుతున్నట్లు సీకేబాబు వివరించారు.



ఆభరణాల ప్రదర్శనలో జాతర వంశ పారంపర్య ధర్మకర్త సీకేబాబు

అలరించిన దుర్యోధన వధ

శ్రీరంగరాజపురం : మండలంలోని 49కొత్తపల్లె శ్రీద్రౌపదీధర్మరాజుల స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం దుర్యోధన వధ ఘట్టం ఆకట్టుకుంది. ఉదయం ఆలయంలో ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. ద్రౌపది, శ్రీకృష్ణ, భీమ, అర్జున, నకుల, సహదేవ ఉత్సవమూర్తులను గ్రామ వీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయ అవరణలో దుర్యోధన వధ ఘట్టం ప్రారంభమైంది. దుర్యోధనుడిని గంగమడుగు నుంచి భీముడు బయటకు రప్పించే ఘట్టాన్ని కళాకారులు రక్తికట్టించారు. దుర్యోధనుడు ఆలపించిన పద్యాలు కంటితడి పెట్టించాయి. అనంతం ధర్మరాజు పట్టాభిషేకం వేడుకగా నిర్వహించారు.

భక్తి శ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం

రాత్రి ఆలయ ఆవరణలో అగ్నిగుండ ప్రవేశం భక్తి శ్రద్ధలతో జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త నాగరాజు, అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



భీమ, ధుర్యోదన పాత్రధారుల యుద్ధ సన్నివేశం

గజరాజుల విధ్వంస కాండ

ఐరాల: మండలంలోని వేదగిరివారి పల్లె పంచాయతీ పరిధిలోని అటవీ ప్రాంత సరిహద్దులోని గూబలవారి పల్లె పంట పొలాలపై ఏనుగుల గుంపు పదే పదే చొరబడుతూ పంటలకు తీవ్రంగా నష్టం కల్గిస్తోంది. శనివారం రాత్రి గూబలవారిపల్లెకు చెందిన రైతు రామూర్తికి చెందిన వరి పంటను తొక్కి నాశనం చేశాయి. రైతు గురవయ్యకు చెందిన కొబ్బరి చెట్లను నేల కూల్చాయి. మరో రైతు హరిప్రసాద్‌కు చెందిన మామిడి చెట్ల కొమ్మలను విరిచేసి, కొన్ని కాయలను తిని, కొన్నింటిని తొక్కి నాశనం చేశాయి. ఈ దాడుల్లో సుమారు రూ.50 వేల పంట నష్టం వాటిలినట్లు బాధిత రైతులు తెలిపారు.



నేలకూలిన కొబ్బరి చెట్టు

మహిళ ఆత్మహత్య కేసులో నలుగురి అరెస్ట్

రామకుప్పం: మండలంలోని నీళచేన్ల గ్రామంలో రెండు రోజుల క్రితం ఆత్మహత్యకు పాల్పడిన యల్లమ్మ(36) కేసులో నలుగురిని అరెస్టు చేసినట్లు కుప్పం రూరల్ సీఐ రియాజ్ అహ్మద్ తెలిపారు. ఆమె మృతికి కారణమైన భర్త తిరుపతి, వళ్లియమ్మ(ఆడపడుచు), మణియమ్మ(ఆడపడుచు), సతీష్‌ను ఆదివారం ఉదయం 9 గంటలకు రామకుప్పం వైఎస్సార్ సర్కిల్‌లో అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. నిందితులను కుప్పం మెజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు తెలిపారు. పరారీలోఉన్న మరో నిందితుడు పాండియన్‌ను త్వరలో పట్టుకుంటామని ఎస్ఐ కృష్ణయ్య పేర్కొన్నారు.

వివాహిత అదృశ్యం

తవణంపల్లె: వివాహితి అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ పి.సుబ్రమణ్యం తెలిపారు. వివరాలు.. పుత్తూరు మండలం కేబీఆర్ మండలానికి చెందిన అల్లి ముత్తు భార్య ఏ.హరిత(30) తవణంపల్లె మండలం కృష్ణాపురంలోని పిన్ని రాణి ఇంటికి ఆదివారం బయలుదేరింది. తర్వాత హరిత భర్త అల్లి ముత్తు పిల్లలతో కలసి కృష్ణాపురం చేరుకున్నాడు. భార్య రాణి అక్కడికి చేరుకోలేదు. ఆమె కోసం పలుచోట్ల గాలించారు. ఆచూకీ తెలియక పోవడంతో అల్లి ముత్తు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌పై టీడీపీ దుష్ప్రచారం

- యువతిపై అఘాయిత్యం అంటూ వీడియో వైరల్
- అయనెవరో తెలియదన్న వీడియోలోని యువతి

రామకుప్పం: మండలంలోని పెద్దతండా సర్పంచ్ మోహన్ నాయక్‌పై టీడీపీ దుష్ప్రచారం చేయడం సర్వత్రా విమర్శలకు తావిచ్చింది. తమిళనాడుకు చెందిన ఓ బాలికను మోహన్‌నాయక్ అత్యాచారం చేసినట్లు టీడీపీ సోషల్ మీడియాలో ఓ వీడియో చక్కర్లు కొట్టింది. దీనిపై ఎల్లో మీడియా రెచ్చిపోయింది. యువతిపై వైఎస్సార్‌సీపీ మద్దతు సర్పంచ్ అత్యాచారం చేసినట్లు ఆరోపించారు. దీనిపై మండల వ్యాప్తంగా విమర్శలు ఎదురయ్యాయి. ఇదిలావుండగా ఆదివారం సంబంధిత యువతి మరో వీడియోను సోషల్ మాధ్యమంలో విడుదల చేసింది. తన వయస్సు 27 సంవత్సరాలని, చెన్నైలో నివాసం ఉంటున్నానని తెలిపింది. మోహన్‌నాయక్ అనే వ్యక్తి తనకు తెలియలేదని, డబ్బు ఆశ జూపి ఒక వ్యక్తి మోహన్‌నాయక్‌పై ఆరోపణలు చేయమని చెప్పడంతో అలా చేశానని పేర్కొంది. మోహన్‌నాయక్‌ను ఎప్పుడూ నేరుగా చూసింది లేదు.. కలిసింది లేదని.. తెలిపింది. 'నన్ను చేయమన్నారు.. చేశాను' అంతే అని ఆ యువతి వీడియోలో స్పష్టంగా తెలిపింది. ఈ విషయంపై సర్పంచ్ మోహన్‌నాయక్ మాట్లాడుతూ చిన్న వయసులో సర్పంచ్‌గా గెలిచి వైఎస్సార్‌సీపీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నందుకు ప్రత్యర్థి టీడీపీ వారు కావాలనే తనపై కుట్ర చేసి సంబంధం లేని యువతితో వీడియో చేయించడం చాలా దారుణమన్నారు. త్వరలోనే కుట్ర వెనుక ఉన్న వారి బండారం బయట పెడతానని తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

కంటైనర్‌ను ఢీకొన్న ట్రక్

- ఇద్దరి పరిస్థితి విషయం
- డీజే సౌండ్ సిస్టమ్స్, ట్రక్కు ధ్వంసం

గంగవరం: పలమనేరు– మదనపల్లె జాతీయ రహదారి అప్పినపల్లె క్రాస్ వద్ద ఆదివారం రోడ్డు పక్కన ఆగి ఉన్న కంటైనర్ లారీని వెనుక నుంచి మినీ ట్రక్ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం.. తమిళనాడు రాష్ట్రం వేలూరుకు చెందిన డానిష్(23), ప్రశాంత్(22) బృందం డీజే సౌండ్ సిస్టమ్ నిర్వహిస్తున్నారు. మదనపల్లె మిట్స్ కళాశాలలో జరిగే కార్యక్రమానికి డీజే నిర్వహణకు ఒప్పందం కుదుర్చుకున్నారు. శనివారం సాయంత్రం మూడు మినీ ట్రక్కుల్లో విలువైన సౌండ్ సిస్టమ్ స్పీకర్లతో కళాశాలలో జరిగే ప్రోగ్రామ్‌కు హాజరై ఆదివారం వేకువజామున తిరుగు ప్రయాణమయ్యారు. ఇద్దరితో కలిసి ముందుగా బయలుదేరిన ట్రక్ అప్పినపల్లె క్రాస్ వద్ద రోడ్డు పక్కన ఆగిఉన్న కంటైనర్ లారీని వెనుక నుంచి వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ట్రక్‌లో ఉన్న ఇద్దరూ తీవ్ర రక్త గాయాలకు గురయ్యారు. ట్రక్ ముందు భాగం, ట్రక్‌లో ఉన్న విలువైన సౌండ్ స్పీకర్లు ధ్వంసమయ్యాయి. హైవే పోలీసులు, ఏఎస్ఐ అశ్వర్థనారాయణ ఘటన స్థలానికి చేరుకున్నారు. ట్రక్‌లో ఇరుక్కుపోయిన ఇద్దరినీ బయటకు తీసి చికిత్స నిమిత్తం పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కంటైనర్ కిందకు దూసుకెళ్లిన ట్రక్